

ఉష్ణోగ్రత

గరిష్ఠం 31.6

కనిష్ఠం 22.5

అందుబాటులో ఇసుక

» కలెక్టర్ నారాయణరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన పనులకు ఇసుకను టీజీఎండీసీ నుంచి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, మిషన్ భగీరథ, విద్యుత్, గ్రౌండ్ వాటర్ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. 2026 మార్చి 31 వరకు ఆయా శాఖలకు ఎంత మేర ఇసుక అవసరమో అంచనా వేసి టీజీఎండీసీకి అందజేయాలన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధి ఓఆర్ఆర్‌ను బేస్ చేసుకొని అబ్దుల్లాపూర్‌మెట్, ఆదిభట్ల, వట్టినాగులపల్లిల్లో సాండ్ బజార్లను ఏర్పాటు చేశామన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో 40వేల టన్నులు, ఆదిభట్లలో 90వేల టన్నుల, వట్టినాగులపల్లిలో 40వేల టన్నుల దొడ్డు, సన్న ఇసుక అందుబాటులో ఉందన్నారు. డిపార్టుమెంట్ వాహనాలతో ఇసుక సరఫరా చేస్తామని, కొనుగోలు చేసే వారు సొంత వాహనాలతోనూ తీసుకెళ్లొచ్చన్నారు. దొడ్డు ఇసుక టన్ను రూ.1,600, సన్న ఇసుక రూ.1,800 ధర నిర్ణయించామన్నారు. రవాణా చా ర్జీలు అదనం అన్నారు. ఇసుక కోసం ఎస్ఎస్ఎంఎస్ పోర్టల్‌లో బుక్ చేసు కోవచ్చన్నారు. రాష్ట్రంలోని ఏ రీచ్ నుంచైనా ఇసుక పొందొచ్చని కలెక్టర్ తెలిపారు. వివరాల కోసం టోల్ ఫ్రీ నంబ ర్ 125242ను సంప్రదించాలన్నారు. సాండ్ బజార్ల నంబర్లు: అబ్దుల్లాపూర్‌మెట్-9154863039, వట్టినాగులపల్లి-9154238603, ఆదిభట్ల- 9154238600కు ఫోన్ చేయాలని వివరించారు.

గోశాల ఏర్పాటుపై సమావేశం

మొయినాబాద్ రూరల్, జూన్4(ఆంధ్రజ్యోతి):మొయినాబాద్ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్కేపల్లి గ్రామస్తులతో సమావేశమయ్యారు. సర్వే నంబర్ 180లోని ప్రభుత్వ భూమిలో గోశాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్, కలెక్టర్ నారాయణరెడ్డి భూమిని పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో గ్రామస్తులతో మాట్లాడాలని ఆర్డీవోను అదేశించారు. బుధవారం ఆర్డీవో ఎన్కేపల్లి వాసులతో సమావేశమయ్యారు. భూమి కోల్పోయే తమకు పరిహారమివ్వాలని గ్రామస్తులు కోరారు. ఆర్డీవో మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని, ఎన్కేపల్లిలోని సర్కారీ భూమిలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. ఈ విషయంలో గ్రామస్తుల అభిప్రాయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఏసీపీ కిషన్, సీఐ పవన్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



శంకర్‌పల్లిలోని సాయి కాలనీలో రేషన్ కోసం క్యూలైన్‌లో సంచులు పెట్టిన లబ్ధిదారులు

గిదేం వరుస!

మూడు నెలలకు ఆరు వేలిముద్రలు

ప్రభుత్వం మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తుండడంతో రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. గంటల తరబడి క్యూలో ఉండలేక సంచులను లైన్‌లో పెడుతున్నారు. సన్నబియ్యం కోసం గంటల తరబడి వరుసలో నిలబడుతున్నారు. గతంలో ఇలా వెళ్లి అలా రేషన్ సరుకులు తెచ్చుకొనే వారు. ప్రస్తుతం మూడు నెలలకు ఆరు సార్లు థంబ్ వేయాల్సి వస్తుండడంతో విసుగు చెందుతున్నారు. దీంతో ఒక్కొక్కరికి తక్కువలో తక్కువ అరగంట సమయం పడుతోందని వాపోతున్నారు. దీనికి తోడు సర్వర్ పనిచేయక మరింత ఆలస్యమవుతుండడంతో చేసేది లేక బియ్యం కోసం అక్కడే ఎదురు చూడాల్సిన పరిస్థితి వస్తోందని నిట్టూరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రేషన్ షాపులను బుధవారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది.

- ఒకేసారి బియ్యం పంపిణీతో అవస్థలు
- రేషన్ షాపుల వద్ద లబ్ధిదారుల బారులు
- క్యూలో చెప్పులు, బస్తాలు, ఇతర వస్తువులు
- మొరాయిస్తున్న సర్వర్.. తెరుచుకోని షాపులు
- రోజు 20 మందికి మించి ఇవ్వలేని పరిస్థితి
- ఒక్కొక్కరికి దాదాపు అరగంట సమయం
- స్థలాభావంతో కోటా తెచ్చుకోని డీలర్లు

ఆంధ్రజ్యోతి విజిట్

రంగారెడ్డి అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలలకు సంబంధించి రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇస్తుండటంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత నెల వరకు రేషన్ కోసం లైన్‌లో 15 నిమిషాలు నిలబడితే సరిపోయేది. మూడు నెలలకు సంబంధించి బియ్యం ఒకేసారి ఇస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కోనెల కోటా బియ్యానికి ఒక్కోసారి తూకం వేయాల్సి వస్తోంది. ఒక్కో నెలకు సంబంధించి కేంద్రం ఇచ్చే బియ్యానికి(ఒక్కొక్కరికి 5 కిలోలు) ఒకసారి, రాష్ట్ర కోటా(ఒక్కొక్కరికి కిలో చొప్పున) బియ్యానికి మరోసారి వేలి ముద్ర వేయిస్తున్నారు. ఇలా మూడు నెలలకు కలిపి

మిగతా 7వ పేజీలో...



చేవెళ్లలో ఆరు బయటే బియ్యం ఇస్తున్న డీలర్

200 షాపులకే బియ్యం

డీలర్లకూ తప్పని ఎదురుచూపులు

పాత స్టాక్‌నే పంపిణీ చేస్తున్న వైనం

నిల్వలు లేక షాపులకు తాళం

7



ఆమనగల్లు మండలంలో మూసి ఉన్న రేషన్ షాపు

- రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం బుల్కాపురంలో బియ్యం పంపిణీ చేస్తున్న క్రమంలో స్టాక్ నుంచి నాలుగు క్వింటాళ్లు కట్ కాలేవని డీలర్ పేర్కొన్నాడు. యాచారం మండలం చౌదరిపలి, మొయినాబాద్ మండలం ఎనికేపల్లిలో సర్వర్ సమస్యతో రేషన్ షాపు మూసివేశారు. మంచాల మండల పరిధిలోని నోముల గ్రామంలో సర్వర్ సమస్య కారణంగా రేషన్ కోసం గంటల తరబడి లబ్ధిదారులు వేచి చూశారు.
- మేడ్చల్ జిల్లా కీసరలో బియ్యం స్టాక్ లేకపోవడంతో రేషన్ షాపును మూసివేశారు. నాగారంలో సర్వర్ సమస్యతో షాపు తెరవలేదు. దమ్మాయిపల్లి, అర్గాన్పల్లి, ఉప్పర్‌పల్లిలో బియ్యం కోసం లబ్ధిదారులు బారులు తీరారు.
- వికారాబాద్ జిల్లా పరిగి మండలం పరిగి, పూడూరు, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లోని రేషన్ షాపులకు బియ్యం కోట పూర్తి స్థాయిలో చేరుకోలేదు. 40శాతం బియ్యమే గ్రామాలకు చేరాయి. బియ్యం కోటా ఉన్న గ్రామాల్లో పంపిణీ ప్రక్రియ సరిగా సాగడం లేదు. కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొమ్రాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాల్లో పూర్తిస్థాయిలో బియ్యం రేషన్ షాపులకు చేరలేదు. బియ్యం కోటా ఉన్న రేషన్ షాపుల్లో సర్వర్ సమస్య వెంటాడుతోంది. దీంతో సకాలంలో బియ్యం పంపిణీ చేయలేకపోతున్నారు. దౌల్తాబాద్ మండలం దేవర్ ఫలస్‌వాద్ మినహా మండలంలోని రేషన్ షాపులకు ఇంకా బియ్యం కోట చేరుకోలేదు. చౌడాపూర్ మండల పరిధిలోని మంది పాల్ గ్రామం మినహా ఇతర రేషన్ షాపులకు బియ్యం సరఫరా కాలేదు. మోమిన్‌పేట మండలానికి ఇంకా బియ్యం స్టాక్ రాకపోవడంతో బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాలేదు.

ఉమ్మడి జిల్లాలో రేషన్ పంపిణీ ఇలా..

జిల్లా	రేషన్ షాపులు	ఆహార భద్రత కార్డులు	ప్రతినెలా పంపిణీ (మెట్రిక్ టన్నుల్లో)
రంగారెడ్డి	936	5,78,500	14,500
మేడ్చల్	619	5,36,755	10,000
వికారాబాద్	588	2,51,097	5,506

పాకిస్థాన్ పాటపాడుతున్న రాహుల్

బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్‌పాటిల్



మాట్లాడుతున్న అభయ్‌పాటిల్, పక్కన ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

శంషాబాద్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై బీజేపీ తెలంగాణ ఇన్‌చార్జి అభయ్‌పాటిల్ తీవ్ర విమర్శలు చేశారు. రాహుల్ పాకిస్థాన్ పాట పాడుతున్నారని విమర్శించారు. బుధవారం శంషాబాద్‌లోని ఓ హోటల్‌లో బీజేపీ 11 వసంతాల పాలన విజయాలను ప్రజలకు వివరించేందుకు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పహల్గామ్‌లో ఉగ్రవాదుల ఘాతకం తరువాత భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు విపక్షనేతలంతా దేశానికి మద్దతుగా నిలిస్తే రాహుల్‌గాంధీ పాకిస్థాన్‌కు వత్తాసు పలుకుతున్నారన్నారు. దేశం విషయంలో ప్రధాని మోదీకి ఎంత బాధ్యత ఉందో రాహుల్‌గాంధీకీ అంతే స్థాయిలో బాధ్యత ఉందని పేర్కొన్నారు. తాము ఎవరికీ సరెండర్ కాలేదని... సరెండర్ అనేది కాంగ్రెస్‌కే వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బు సంపాదించేందుకు, కాంగ్రెస్ పార్టీకి నిధులు సమకూర్చేందుకే శ్రద్ధపెడుతోంది తప్పితే ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని పాటిల్ అన్నారు. నమ్మి ప్రజలు ఓట్లేస్తే కాంగ్రెస్ ప్రజాసంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. కేంద్ర పభుత్వం 4కోట్ల మందికి ఇళ్లు కట్టించిందని, అన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించిందన్నారు. కేంద్ర పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకే కార్యశాల నిర్వహించామన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ పాకిస్థాన్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆపద సమయంలో దేశంలోని నేతలంతా ఏకం కావాల్సి ఉండగా.. రాహుల్‌గాంధీ పొంతనలేని ప్రకటనలతో అపహాస్యం పాలయ్యారన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, నాయకులు ప్రేమేందర్, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, కేఎస్. రత్నం, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, కొమురయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు



తుర్కలపల్లిలో ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

కేశంపేట, జూన్ 4(ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుపేదలకు ఒక్క ఇల్లూ ఇవ్వలేదని, డబుల్ బెడ్‌రూమ్‌ల పేరుతో కాలం గడిపారని షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ సొంతిల్లు కట్టిస్తోందన్నారు. లేమామిడి పరిధి తుర్కలపల్లి, కేశంపేటల్లో బుధవారం ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి ప్రొసీడింగ్‌లను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వాలే పేదలకు ఇళ్లు నిర్మించాయని, బీఆర్ఎస్ పాలకులు ఒక్క ఇల్లూ కట్టలేదన్నారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి 24గంటలూ పనిచేస్తున్నారన్నారు. మండలానికి 1,100 ఇండ్లు మంజూరు చేశామన్నారు. లేమామిడి రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసి కొత్త చట్టాన్ని తెస్తామని షాద్‌నగర్ సభలో రాహుల్ గాంధీ చెప్పిన మాటను రేవంత్‌రెడ్డి సర్కార్ అమలు చేసిందన్నారు. ధరణి కల్వకుంట్ల ఫ్యామిలీకి చుట్టంగా మారి భూ ఆక్రమణలకు ఉపయోగపడిందన్నారు. రెవెన్యూ వ్యవస్థలను కేసీఆర్ నామరూపాల్లేకుండా చేసి రైతులను ఇబ్బందుల్లోకి నెట్టారన్నారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ఆజంఅలీ, ఆర్ఐ నివేదిత, ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, ఏఈ నర్సింగ్‌రావు, నాయకులు భాస్కర్‌గౌడ్, కరుణాకర్, విశాల, వీరేశ్, రాణి, జగదీశ్వరప్ప, శ్రీధర్‌రెడ్డి, నర్సింలు, లక్ష్మయ్య, సుందరయ్య, గిరిధర్‌యాదవ్, రమేష్ పాల్గొన్నారు.

డిగ్రీ ఫస్టియర్‌లో అడ్మిషన్లు ఆరంభం

చేవెళ్ల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఫస్టియర్ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్లకు దోస్త్ పోర్టల్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన జరుగుతోందని, కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు రెగ్యులర్ కోర్సుతో పాటు ఉద్యోగ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తామన్నారు. దోస్త్ కోడ్ 2041 ద్వారా ఆన్‌లైన్ ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ వివరించారు.



నందివనపర్తిలో పీహెచ్‌సీ ఏర్పాటుకు చర్యలు

సబ్ సెంటర్ వద్దే అదనంగా గదులు నిర్మిస్తాం

డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

7



పబ్లిక్ స్కూల్‌గా తీర్చి దిద్దే నమూనా

పబ్లిక్ స్కూల్స్‌గా ప్రభుత్వ బడులు

మోడల్‌గా ఆరుట్ల పాఠశాల ఎంపిక

తదుపరి రాష్ట్ర మంతా విస్తరణ

కొనసాగుతున్న పనులు

మంచాల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ప్రభుత్వ బడులను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా మార్చనున్నారు. ఇందుకు మంచాల మండల ఆరుట్ల ఉన్నత పాఠశాలను మోడల్‌గా ఎంపిక చేశారు. ఇక్కడి జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక, ప్రీప్రైమరీ, మోడల్ స్కూల్‌లు ఒకే ప్రాంగణంలో ఉండడంతో పైలట్ స్కూల్‌గా ఎంపిక చేశారు. రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి 2024 డిసెంబర్‌లో ఆరుట్ల పాఠశాలను సందర్శించారు. ప్రజా భాగస్వామ్యంతో పాఠశాలను

మిగతా 8వ పేజీలో...

ఇంగ్లిష్ మీడియం ప్రవేశం

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటులో భాగంగా ఈ ఏడాది నుంచి ఆరుట్ల పాఠశాలలో ప్రీ, ప్రైమరీ స్థాయి నుంచే ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టనున్నారు. డిజిటల్ తరగతులు, అందుకు గదుల నిర్మాణ పనులు చేస్తున్నారు. 26 మందితో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామంలో బడిబాట విజయవంతమైంది. ఇప్పటికే పాఠశాలలో 570మంది విద్యార్థులుండగా కొత్తగా 200మంది చిన్నారులకు అడ్మిషన్ తీసుకున్నారు.

సివిల్ ర్యాంకర్‌కు గవర్నర్ సన్మానం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణానికి చెందిన సివిల్ ర్యాంకర్ భరద్వాజ్‌ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సన్మానించి, జ్ఞాపికను అందించారు. రాష్ట్రంలో సివిల్స్ ర్యాంకర్లను బుధవారం హైదరాబాద్‌లోని రాజ్ భవనంలో గవర్నర్ సన్మానించారు. అందులో భాగంగా భరద్వాజ్‌ను సైతం సన్మానించారు. షాద్‌నగర్‌లోని డ్రీమ్‌ల్యాండ్ కాలనీకి చెందిన రిటైర్డ్ సీడీపీవో నాగమణి కుమారుడు భరద్వాజ్ సివిల్స్‌లో 905వ ర్యాంకు సాధించాడు.



భరద్వాజ్‌కు మెమొంటో అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్



ఉద్యాన పంటల సాగుపై మాట్లాడుతున్న కోదండరెడ్డి, పక్కన ఎమ్మెల్యే మల్‌రెడ్డి

కూరగాయల రైతులను ఆదుకుంటాం

యాచారంలో మినీ కూరగాయల మార్కెట్

- రుణమాఫీ రాని రైతులకు వర్తింపజేసేలా చర్యలు
- ఫార్మాసిటీని ఎత్తివేశాం..
- కాలుష్య రహిత పరిశ్రమలు స్థాపిస్తాం
- కొత్తగా భూసేకరణ చేయం
- రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కూరగాయ పంటల రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, కూరగాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ వసతులు కల్పిస్తామని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలు అన్నారు. బుధవారం యాచారం రైతు వేదికలో 'ఉద్యాన సాగు పైలెట్ ప్రాజెక్టు' అంశంపై రైతులతో మాట్లాడారు. జిల్లాలో ఉత్పత్తయిన కూరగాయలను హైదరాబాద్‌లోని హోటళ్లు, వివిధ మార్కెట్లకు తరలించేలా సదుపాయాలు కల్పిస్తామన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి కూరగాయల దిగుమతిని నివారిస్తామన్నారు. ఇక్కడ ఉత్పత్తయిన కూరగాయలనే

మిగతా 8వ పేజీలో...

అర్ధరాత్రి గోవుల అక్రమ రవాణా

అడ్డుకోబోయిన యువకులపై దాడికి యత్నం

ప్రభుత్వ అధికారే సూత్రధారిగా అనుమానాలు

పెద్దేముల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి వేళ గోవుల అక్రమరవాణాను అడ్డుకున్న యువకులపై దుండగులు దాడికి యత్నించారు. ఈ ఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం జనగాం గ్రామ శివారులో అటవీశాఖ అధికారికి ఫాంల్యాండ్ ఉంది. అక్కడి నుంచి గోవుల అక్రమరవాణా జరుగుతోందని బీజేపీ కార్యకర్తలకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. దీంతో కొంతమంది యువకులు అర్ధరాత్రి జనగాం గ్రామానికి చేరుకున్నారు. డీసీఎంలో గోవులు ఉండడం గమనించి వారు 100కు డయల్ చేశారు. విషయాన్ని తెలియజేసి గోవుల అక్రమరవాణాను అడ్డుకోవాలని ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చేవరకు డీసీఎంను వెళ్లనీయకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే డీసీఎం ముందు, వెనక ఒక ఫార్చునర్‌కారు, బ్రీజాకారులో కొంతమంది రాడ్లు, కర్రలు పట్టుకుని ఉన్నారు. అడ్డుకోబోతే వారు దాడికి ప్రయత్నించారు. దీంతో కొంతమంది యువకులు పారిపోగా గొబ్బురు రాము అనే యువకుడికి కర్రలు, రాడ్లు చూయించి భయపెట్టి పక్కకు తోసివేశారు. అక్కడి నుంచి వారు డీసీఎంలో గోవులను తీసుకుని వెళ్లిపోయారు. ఈవిషయమై యువకులు పెద్దేముల్ పోలీస్‌స్టేషన్, తాండూరు డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అటవీశాఖకు చెందిన ప్రభుత్వ అధికారి ఫాంల్యాండ్ నుంచి గోవుల అక్రమరవాణా జరిగిందని, గోవుల అక్రమరవాణాకు ఆ అధికారి సూత్రధారి అయిఉంటాడని వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డిని వివరణ కోరగా యువకుల ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని చెప్పారు.



డీఎస్పీకి ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు



విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేస్తున్న టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఘట్‌కేసర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు స్కిల్-అప్‌స్కిల్-రీస్కిల్ అనే మూలసూత్రాన్ని అనుసరించాల్సిన అవసరం ఎంతో ఉందని తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సీఈవో శ్రీకాంత్ సిన్హా అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండపూర్‌లో గల సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్‌లో బుధవారం పాలిటెక్నిక్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఐటీలతో కలిసి నిర్వహిస్తున్న ఏఐ సమ్మర్ ఇంటర్న్‌షిప్ అవకాశాలపై దృష్టి సారించాలన్నారు. డ్రగ్ ఫ్రీ క్యాంపస్, డ్రగ్ ఫ్రీ రాష్ట్రం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా 450మంది గ్రాడ్యుయేట్లకు డిగ్రీ పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేల్పూరి చక్రవర్తి, సంస్థ చైర్మన్ ఏపీ రమణారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె కేశవరెడ్డి పాల్గొన్నారు.

పట్టణ పారిశుధ్యానికి సహకరించాలి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలో చేపడుతున్న పారిశుధ్యానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ సునీత కోరారు. మున్సిపాలిటీలో చేపట్టిన వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం కాలనీలలో పర్యటిస్తూ తడి, పొడిచెత్త వేరు చేయటంపై అవగాహన కల్పించారు. ప్రతీ వార్డు నుంచి చెత్తను సేకరించడానికి వాహనాలను నడిపిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్తబండిలోనే వేయాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

పదవీ విరమణ వయస్సు పెంచాలనుకోవడం సరికాదు

» ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

కొడంగల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ వయస్సును 61 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని ప్రభుత్వం ఆలోచించడం సరైంది కాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. బుధవారం సిద్దిపేటలో జరిగిన రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పదవీ విరమణ వయస్సు పెంచడంతో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఎంతో మంది నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇలాంటి ఆలోచనను విరమించుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను సత్వరమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ షఫీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి వెంకటరవణ

వైద్యులు దైవంతో సమానం

ధారూరు, జూన్4(ఆంధ్రజ్యోతి): ప్రజల దృష్టిలో వైద్యులు దైవంతో సమానమని జిల్లా వైద్యాధికారి వెంకటరవణ తెలిపారు. మండలంలోని నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన సూపర్‌వైజర్ లక్ష్మి అభినందన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సూపర్‌వైజర్ లక్ష్మి రోగులకు చేసిన సేవలకు అభినందనీయమని, ఆమె సేవలను ప్రజలు గుర్తుంచుకునేలా విధులు నిర్వర్తించారని తెలిపారు. అనంతరం లక్ష్మిదంపతులను ఆయన వైద్య సిబ్బందితో కలిసి శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి జయరాం, పీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ మేఘన, వైద్య సిబ్బంది ప్రీతమ్, ఉమ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చల్లా నర్సింహారెడ్డి

సమస్యల పరిష్కారానికే భూ భారతి

» టీయూఎఫ్ఐడీసీ స్టేట్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి

మహేశ్వరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం ఉపయోగపడుతుందని టీయూఎఫ్ఐడీసీ స్టేట్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నతూప్ర గ్రామం, తుక్కుగూడ మున్సిపాలిటీలోని శ్రీనగర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ధరణి పోర్టల్ ద్వారా అనేక మంది పేదల భూములు అన్యాక్రాంతమయ్యాయని అన్నారు. భూ సమస్యల పరిష్కారమయ్యేలా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భూ భారతి చట్టం అమలుకు ఎంతో కృషి చేశారన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య, తహసీల్దార్ సైదులు, డీటీ నవత, ఆర్ఐ స్వర్ణలత, పావనితో పాటు రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్ రత్నం

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

» జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. విద్యార్థుల నమోదు ప్రచార జాత బుధవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకటరత్నం మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, వెంకట్రాములుగౌడ్, ముత్యప్ప, శివరాజ్, రత్నం, జమున, సుశీలమ్మ, గౌరారం గోపాల్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల భవనం పరిశీలన

బషీరాబాద్, జూన్ 04 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే ఆదేశానుసారం బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి, సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ బుధవారం భవనాన్ని పరిశీలించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు)లో పాత భవనాన్ని పరిశీలించిన వారు ఈ విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. రెండేళ్ల కిందట గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బషీరాబాద్ మండలానికి జూనియర్ కళాశాల మంజూరైన అధ్యాపకుల నియమకం లేక ప్రారంభం కాలేదన్నారు. ప్రస్తుత తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఎనిమిది మంది కొత్త ఉపాధ్యాయులు నియామకమయ్యేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. వీరి వెంట కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మొద్దులకుంట పూడ్చివేతను ఆపండి

» ఆర్డీవో అనంతరెడ్డికి ఫిర్యాదు చేసిన రైతులు

యాచారం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాండ్లగూడ గ్రామంలో ఉన్న మొద్దులకుంట పూడ్చివేతను తక్షణమే ఆపాలని కోరుతూ యాచారం మండల కేంద్రానికి చెందిన పలువురు రైతులు బుధవారం ఇబ్రహీంపట్నం అనంతరెడ్డికి ఫిర్యాదు చేశారు. కుంట పూడ్చివేత కారణంగా భూగర్భజలం తగ్గుతుందని, తద్వారా బోరుబావులు నిలువునా ఎండిపోయే ప్రమాదముందని కోరారు.

కూల్చివేతలకు బ్రేక్

» అధికారుల తీరుపై అనుమానాలు!



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలోని ప్రధాన రోడ్లపై ఆక్రమణల కూల్చివేతలకు బల్దియా అధికారులు సడన్‌గా బ్రేక్ ఇచ్చారు. ఈ నెల 3న 'ఆక్రమణల కూల్చివేతలపై రగడ' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై అధికారులు, రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. మంగళవారం తాండూరుకు వచ్చిన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) సుధీర్‌కుమార్ ఆక్రమణ కూల్చివేతలపై ఆరా తీశారు. ఇందుకు సంబంధించి నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో నోటీసుల జారీకి బల్దియా అధికారులు సిద్ధమైనట్లు సమాచారం. కూల్చివేతల అంశం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో తాత్కాలికంగా కూల్చివేతలు ఆపాలని ఆదేశాలు జారీ చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రెండు రోజులుగా కూల్చివేతలు జరుగకపోవడం పలు విమర్శలను తావిస్తోంది. నాలుగు రోజుల క్రితం కూల్చివేతలు ప్రారంభించి వదిలేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇందిరాచౌక్ నుంచి రైల్వేస్టేషన్ మార్గంలో కూల్చివేతలు ప్రారంభించే క్రమంలో బ్రేక్ పడింది. అధికారులు నోటీసుల జారీ పేరుతో మరింత ఆలస్యం చేస్తున్నారని తెలుస్తోంది.

నాణ్యత పాటించకుంటే చర్యలు

ఆమనగల్లు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): హోటళ్ల నిర్వాహకులు నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ హెచ్చరించారు. ఆమనగల్లులోని హోటళ్లు, బేకరీలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లను బుధవారం తనిఖీ చేశారు. హోటళ్ల కిచెన్‌లు, పదార్థాలకు వినియోగించే ముడిసరుకులను, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. నాణ్యత పాటించని హోటళ్ల నిర్వాహకులకు జరిమానా విధించారు. లైసెన్సులు లేని వారు, రెన్యూవల్ చేసుకోని వారికి నోటీసులిచ్చి చర్యలకు ఆదేశించారు. పరిశుభ్రత లేని, కల్తీ ఆహారాన్ని ప్రజలకు విక్రయించి వారి ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు. మునిసిపాలిటీలో తరచూ తనిఖీలు చేస్తామని చెప్పారు. ఆయనతో శానిటేషన్ సూపర్‌వైజర్ ఎల్లయ్య, ఇన్‌చార్జి మేనేజర్ సత్యనారాయణ, వార్డు అధికారులు సంతోష, గౌతమి, సురేందర్, సిబ్బంది రామకృష్ణ, సుభాష్, సికిందర్, సాయిరామ్ ఉన్నారు.



బేకరిలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్

గిదేం వరుస!

(ఐదో పేజీ తరువాయి)

ఆరు సార్లు వేలిముద్రలు వేయాల్సి వస్తోంది. ఆయా కోటాల ప్రకారం ఆరుసార్లు తూకం వేస్తున్నారు. దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

డీలర్లకు తప్పని తిప్పలు

ఒకేసారి మూడు నెలల బియ్యం ఇస్తుండటంతో వేకువజామునే రేషన్ షాపుల వద్ద 40 మంది వరకు క్యూలో నిలబడితే 25 మంది పూర్తయ్యేసరికి సమయం గడిచిపోతోంది. సాయంత్రం మళ్లీ కొత్తగా మొదటి నుంచి లైన్‌లో ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గంటల తరబడి నిలబడలేక లబ్ధిదారులు క్యూలైన్‌లో చెప్పులు, బస్తాలు ఇతర వస్తువులు పెడుతున్నారు. మూడు నెలలకు సంబంధించి బియ్యం కోటా ఒకేసారి రావడంతో డీలర్లు ఎక్కడ స్టోరేజ్ చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. బియ్యం బస్తాలు స్టోరేజీ చేసుకునేందుకు స్థలం లేక కొంత మంది డీలర్లు సగం కోటనే తెచ్చున్నారు.



కొర్రేముల రేషన్ షాపు వద్ద బారులు తీరిన లబ్ధిదారులు



మైలారంలో ఖాళీగా రేషన్ షాపు

మధ్యాహ్నం వరకు వేచి చూశా..



నేను రోజు కూలి పనికి పోతాను. రెక్కాడితే గాని డొక్కడది. బియ్యం కోసం రేషన్ షాపుకు ఉదయం 6 గంటలకు వచ్చిన. అప్పటికే షాపు వద్ద లైన్ ఉంది. ఒక్కరికి బియ్యం ఇచ్చేందుకు అరగంట పడుతుంది. నేను బియ్యం తీసుకునే వరకు మధ్యాహ్నం దాటింది. కనీసం.. టీ కూడా తాగలేదు. బియ్యం కోసం ఒక రోజు కూలి పోయింది. వేలి ముద్రలు ఆరు సార్లు పెట్టాల్సి వస్తుంది. ఒకేసారి వేలి ముద్ర వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మహబూబ్, చేవెళ్ల

200 షాపులకే బియ్యం

డీలర్లకూ తప్పని ఎదురుచూపులు

వికారాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేయాల్సి రావడంతో ఇటు లబ్ధిదారులకు, అటు రేషన్ డీలర్లకు ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలో ఇప్పటివరకు 200 రేషన్ దుకాణాలకు మాత్రమే బియ్యం సరఫరా చేయగా, ఇంకా 300 దుకాణాలకు సరఫరా చేయాల్సి ఉంది. జిల్లాకు సరిపడా సన్నబియ్యం స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఇతర జిల్లాలపై ఆధారపడాల్సి వస్తోంది. జిల్లాలోని రేషన్ దుకాణాలకు వనపర్తి, నిజామాబాద్, పెద్దపలి జిల్లాల నుంచి సన్న బియ్యం సరఫరా చేస్తున్నారు. కాగా, రెండు, మూడు రోజుల్లో మిగిలిన రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేసేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

అప్‌డేట్ చేసినా ఆలస్యమే..

రేషన్ బియ్యం పంపిణీకి కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేసినా ఈ-పాస్ యంత్రాలు సర్వర్, నెట్‌వర్క్ సమస్యల కారణంగా బియ్యం పంపిణీలో జాప్యం చోటు చేసుకుంటోంది. లబ్ధిదారులు గంటల తరబడి బియ్యం కోసం నిరీక్షించాల్సి వస్తోంది. జిల్లాలో అన్ని రేషన్ దుకాణాల్లో మూడు నెలల బియ్యం పంపిణీ కొనసాగడం లేదు. గత నెలలో లబ్ధిదారులు తీసుకువెళ్లని బియ్యాన్ని తమ వద్ద స్టాక్ ఉన్నంత మేర డీలర్లు పంపిణీ చేస్తున్నారు. బియ్యం నిల్వలు లేని రేషన్ డీలర్లు పౌర సరఫరాల శాఖ అధికారులు పంపించే బియ్యం కోసం ఎదురుచూస్తున్నారు. బియ్యం అందుబాటులో లేని రేషన్ డీలర్లు తమ దుకాణాలను మూసివేసి బియ్యం కోసం ఎదురు చూస్తున్నారు.

ఘట్‌కేసర్‌లో ధాన్యం సేకరణ పూర్తి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మండలంలోని ఎదులాబాద్, మాధారం, ప్రతాప్‌సింగారం, అంకుశాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ముగిసినట్లు పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సుగుణబాయి తెలిపారు. జిల్లాలో 14 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరించారు. ఎదులాబాద్ సెంటర్‌లో 300 మంది రైతుల నుంచి 2,526.880 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, 191 మందికి రూ.3,49,40,864 చెల్లించారు. 109 మంది రైతులకు రూ.2,36,82,752 చెల్లించాల్సి ఉంది. మాధారం సెంటర్‌లో 131 మంది రైతుల నుంచి 1,171.96 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. 120 మందికి రూ.2,38,98,448 చెల్లించగా ఇంకా 11 మందికి రూ.32,61,408 చెల్లించాల్సి ఉంది. ప్రతాప్‌సింగారం సెంటర్‌లో 81 మంది రైతుల నుంచి 448.520 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, 38 మందికి రూ.53,56,408 చెల్లించారు. ఇంకా 43 మందికి రూ.50,01,632 చెల్లించాల్సి ఉంది. అంకుశాపూర్ కేంద్రంలో 49 మంది రైతుల నుంచి 562.160 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి 20 మంది రైతులకు రూ.60,58,200 చెల్లించారు. మరో 29 మందికి రూ.69,83,912 చెల్లించాల్సి ఉందని వివరించారు. డబ్బులు రాని వారికి త్వరలో ట్యాబ్ ఎంట్రీ చేయించి డబ్బులు ఖాతాల్లో జమచేయనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో జిల్లాలోని మిగతా కేంద్రాల్లోనూ ధాన్యం సేకరణ పూర్తవుతుందని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

» కలెక్టర్ ప్రతీక్ జైన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూన్ 4: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. విద్యా సంవత్సరం 2025-26 ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని శాఖల అధికారులు మండల స్థాయి అధికారులు వారితో పాటుగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడిబాట కార్యక్రమం ఈనెల 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించాలని సూచించారు. ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాఠశాలల్లోని సౌకర్యాల గురించి విస్తృత ప్రచారం పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనుల్లో ఎలాంటి సమస్యలు రాకుండా ప్రొగ్రెస్ ఉండాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు, వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించి ఆర్థిక సాయం పొందే విధంగా దరఖాస్తులు స్వీకరించి ప్రతిపాదన రూపొందించాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వం నుండి పెన్షన్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఈఓ రేణుకదేవి, ఎంపీడీవో తహసీల్దార్, ఏపీఎంఎస్ మునిసిపల్ కమిషనర్లు, ప్రిన్సిపల్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.రి

నందివనపర్తిలో పీహెచ్‌సీ ఏర్పాటుకు చర్యలు

యాచారం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని, ఇబ్బందులు రాకుండా వైద్యులు చొరవ చూపాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్‌రావు మండల వైద్యులను ఆదేశించారు. బుధవారం యాచారం ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం నందివనపర్తికి హెల్ సబ్‌సెంటర్‌ను పరిశీలించారు. ఇక్కడి భవనం కుంగిపోవడాన్ని ఆశ్చర్యపోయారు. భవనానికి తాము మరమ్మతులు చేయిస్తామని బీఎస్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి డీఎంహెచ్‌ఓకు వివరించారు. ఇదిలా ఉంటే యాచారంలో ఏరియా ఆస్పత్రి ఏర్పాటైన నేపథ్యంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నందివనపర్తికి తరలిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. సబ్ సెంటర్ వద్దే అదనంగా నాలుగు గదులు నిర్మిస్తే పీహెచ్‌సీ నిర్వహణకు అనువుగా ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను ప్రజలు వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. ప్రైవేట్‌కు ధీటుగా సేవలందించాలని కోరారు. ఆయన వెంట డాక్టర్ ప్రియాంక ఇతరు వైద్యులు ఉన్నారు.



నందివనపర్తి ఆరోగ్య కేంద్రం వద్ద పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

గ్రామకంఠం భూమిలో ఇంటి స్థలాలు చూపాలి

యాచారం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గ్రామకంఠం భూమిని గ్రామంలో ఇల్లు లేని పేదలకు కేటాయించి, ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని మంతన్‌గౌడ్, సుల్తాన్‌పూర్ గ్రామాల రైతులు రెవెన్యూ సదస్సులో ప్లకార్డులతో నిరసన తెలిపారు. బుధవారం మంతన్‌గౌడ్, నజ్దిక్‌సింగారం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామకంఠం భూమిని తక్షణమే సర్వే చేసి పేదలకు ఇంటి స్థలాలకోసం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధరణి పోర్టల్ కారణంగా తమకు పట్టాపాస్‌బుక్‌లు రాలేదని రైతులు నిరసన తెలిపారు. రుణమాఫీ వర్తించని రైతులకు వెంటనే వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న భూతగాదాలను పరిష్కరించాలని రైతులు కోరారు. తాటిపర్తి, కుర్మిద్ద, నజ్దిక్‌సింగారం, నందివనపర్తి గ్రామాల మధ్య ఉన్న 1400 ఎకరాల భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇచ్చి హక్కులు కల్పించాలని నజ్దిక్‌సింగారంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు డిమాండ్ చేశారు. కాస్తు కాలంలో రైతుల పేరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమాలలో డిప్యూటీ తహసీల్దార్ కీర్తి సాగర్, ఆర్ఐలు మురళీకృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న రైతులు

ఊరూరా బడిబాట

కేశంపేట/చౌదరిగూడ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింహులు గౌడ్ తెలిపారు. జిల్లా కమిటీ పిలుపు మేరకు బుధవారం కేశంపేట మండలంలోని సంతాపూర్, దత్తాయపల్లి, ఇప్పలపల్లిలో ఇంటింటికీ తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కేశంపేట, ఫరూఖ్‌నగర్ మండల ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, సత్యం, మండల ఉపాధ్యక్షుడు వినీత్‌గౌడ్, కార్యదర్శులు రాజు, అరుణ్ శ్రీశైలం, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప అన్నారు. ఉమ్మడి కొందుర్గు మండల పరిధిలోని అయోధ్యపూర్ తండా, రాంచంద్రపూర్, చౌదరిగూడ, ఇంద్రనగర్ తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు శేఖర్‌గౌడ్, రాములు, నర్సింహులు, విజయ్, సంజీవ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : సంతాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు



కొందుర్గులో మాట్లాడుతున్న వెంకటప్ప



శంషాబాద్‌లో చౌకధరల షాపును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

బియ్యం పంపిణీని సజావుగా చేపట్టాలి

రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

శంషాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బియ్యం పంపిణీని సజావుగా చేపట్టాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని చౌకధరల దుఖాణాలను బుధవారం సాయంత్రం పరిశీలించారు. జూన్, జూలై, ఆగస్టు మాసాలకుగాను ఒకేసారి బియ్యం పంపిణీ జరుగుతున్నందున ఆమె చౌకధరల దుఖాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీలర్లను, రేషన్ కార్డుదారులతో మాట్లాడి పంపిణీ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కాగా రెండు రోజుల పాటు సర్వర్ డౌన్ కారణంగా కొంత మేరకు ఇబ్బందులు ఎదురయ్యాయని గుర్తించారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల తరువాత టోకెన్లు జారీ చేయాలని సూచించారు. అదేవిధంగా బియ్యం నిల్వలు ఎప్పటికప్పుడు సరిపడేలా చూసుకోవాలని గోదాం ఇన్‌చార్జికి సూచించారు. మూడు నెలల బియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తియ్యేలా చూడాలని సిబ్బందని ఆదేశించారు. కార్డుదారులు కూడా సహకరించాలని ఆమె సూచించారు.

మోదీతోనే దేశాభివృద్ధి


విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న డాక్టర్ వైభవ్‌రెడ్డి

చేవెళ్ల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి పీఎం నరేంద్రమోదీతోనే సాధ్యమౌతుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఆయన ఎంపీగా గెలుపొంది ఏడాది పూర్తైన సందర్భంగా చేవెళ్లకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు మల్గారి వైభవ్‌రెడ్డి కొండాను ఘనంగా సన్మానించి, తిరుమల తిరుపతి ప్రసాదం అందజేశారు. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిమాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామాల్లో అర్హులైనవారికి అందేలా చూడాలని అన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి


కందుకూరులో మాట్లాడుతున్న బుట్టి బాల్‌రాజ్

కందుకూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న నిర్వహించే మహేశ్వరం ఆర్టీసీ డిపో మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయు మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. కందుకూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాట్లాడుతూ కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 29 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. డిపో కన్వీనర్ ఎం.సాయిలు, జంగయ్య, వి.కృష్ణ, నరసింహ పాల్గొన్నారు.

220వ రోజుకు చేరిన రిలే దీక్షలు

తలకొండపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రం చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారం 220వ రోజుకు చేరాయి.

కూరగాయల రైతులను ఆదుకుంటాం

(ఐదో పేజీ తరువాయి)


యాచారంలో పశువుల ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డాక్టర్ గోపి

ప్రజలకందించేలా చూస్తున్నామన్నారు. యాచారంలో కూరగాయల మినీ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సారి ప్రభుత్వం రైతులకు పది కిలోల చొప్పున వరి విత్తనాలను అందజేస్తోందని, ఫౌండేషన్ సీడ్ రూ.550 విలువైన ఒక్కో బస్తాను ఎంపిక చేసిన రైతులకు రూ.50కే బస్తా చొప్పున ఇస్తున్నామన్నారు. వీటితో పండిన పంటను ఆహారానికి వాడొద్దని, విత్తనాలను తోటి రైతులకు విక్రయించాలని కోరారు. ఇప్పటికే లక్షలాది మంది రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేశామని, కొన్ని సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని వారికి వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాసిటీని రద్దు చేశామని, మళ్లీ భూసేకరణ చేయం అని ఖరాఖండీగా చెప్పారు. కాలుష్యరహిత పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి కల్పించేలా సీఎం చర్యలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం యాచారంలోని రైతుభవనాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తూ ఫార్మాలిటీస్ పూర్తి చేశారు. సాగర్-హైదరాబాద్ రహదారి పక్కన నిర్మించే కూరగాయల మార్కెట్ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమాల్లో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, భవానీరెడ్డి, కార్యదర్శి గోవింద్, హరివెంకటప్రసాద్, రాష్ట్ర వ్యవసాయా శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి, అదనపు డైరెక్టర్ రవికుమార్, డీఏవో నరసింహరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సురేష్, ఆర్డీవో అనంతరెడ్డి, ఏడీఏ సుజాతరెడ్డి, తహసీల్దార్ అయప్ప, ఏవో రవినాథ్, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ ఛైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ కె.శ్రీనివాస్ రెడ్డి, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగాలు రాకుండా చర్యలు తీసుకోవాలి

పశు వైద్యులు తరచూ గ్రామాలకు వెళ్లి వైద్య సేవలందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి పశువైద్యులను ఆదేశించారు. జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బాబుబేరీతో కలిసి యాచారం పశువుల ఆసుపత్రిని తనిఖీ చేశారు. రోగాలబారిన పడ్డ పశువులను మండల పశువైద్యశాలకు రప్పించి వైద్యం చేయాలని సూచించారు. పాడిపశువుల పెంపకంపై పశుపోషకులకు ఆసక్తి కల్గించాలన్నారు. ఆస్పత్రుల్లో మందుల కొరత రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రేఖ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం


నర్కూడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదోడి సొంతింటి కల నేరవేరబోతోందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని నర్కూడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు వరం కాబోతుందని చెప్పారు. రాష్ట్రంలో ఎంతో మంది నిరుపేదలు ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థలం ఉన్న ప్రతీ పేదవాడికి రూ.5 లక్షలు ఇస్తుందన్నారు. గత ప్రభుత్వాలు పేదలను గాలికొదిలేశారని విమర్శించారు. నర్కూడలో 85 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్‌పల్లి నరేందర్, కాంగ్రెస్ మండలా ధ్యక్షుడు శేఖర్ యాదవ్, మాజీ జడ్పీటీసీ తన్వీరాజు, ఎంపీటీసీ అశోక్, మాజీ సర్పంచ్ ఇస్తారి, నాయకులు మహేందర్, అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి


ఇబ్రహీంపట్నం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడి

ఇబ్రహీంపట్నం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణిని అడ్డుపెట్టుకుని అక్రమంగా కాజేసిన భూములను వెలికి తీస్తామని, భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చిన తర్వాత అనేక మంది రైతుల భూములను రికార్డుల నుంచి తొలగించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఈ సమస్యలను పరిష్కరించి రైతులకు హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని అన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో వేలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో కూడా అనేక భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లాయని, వీటన్నింటినీ వెలికి తీస్తామని చెప్పారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఖానాపూర్‌లో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఇక్కడ సర్వేనెంబర్ 43,79లలో అసైన్డ్‌దారుల పేర్లను ఆన్‌లైన్ నుంచి తొలగించడంతో ఇబ్బందులు పడుతున్నారని.. వారి పేర్లను తిరిగి ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆర్డీవో అనంతరెడ్డి మాట్లాడుతూ కోర్టు కేసులు మినహా భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. తహసీల్దార్ సునీతారెడ్డి, ఉప్పరిగూడ ప్యాక్స్ ఛైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ కౌన్సిలర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదిభట్ల : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. కప్పపహాడ్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 42 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సీలింగ్ భూమిని ప్రభుత్వం పేద ప్రజలకు పంచాలని సీపీఎం నాయకులు డీటీకి వినతి పత్రం అందజేశారు. అధికారులు ముస్తఫా, సూర్య, విష్ణు, సీపీఎం నాయకులు జంగయ్య, బుగ్గరాములు, ప్రభుదాస్, విఘ్నేష్, స్వామి రైతులు తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : రైతుల మేలుకోసమే భూభారతి చట్టాన్ని ప్రజల వద్దకే తీసుకువచ్చి భూసమస్యలను పరిష్కరించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యమని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. రుద్రారం గ్రామంలో రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ అన్వర్, ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డితో కలిసి పాల్గొన్నారు. పీఏసీఎస్‌వైస్ ఛైర్మన్ మద్దూరి మల్లేష్, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ బండ మహేందర్‌గౌడ్, నాయకులు యాదిరెడ్డి, వేణుగోపాల్, సంజీవ రెడ్డి, బందయ్య, రైతులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : తుమ్మలపల్లి, ఇంద్రనగర్‌లో తహసీల్దార్ జగదీశ్వర్ ఆధ్వర్యంలో సదస్సులు కొనసాగుతున్నాయి. మొత్తం దరఖాస్తులు 56గాను 17 దరఖాస్తులను తిరస్కరించినట్లు ఆయన తెలిపారు. సిబ్బంది రాకేష్, శ్రీనివాస్ రెడ్డి, మహేందర్‌గౌడ్, రామస్వామి, రాజు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చలివేంద్రం పల్లి రాజు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.


కొత్తూర్ : ఖాజీగూడతండాలో సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

కొత్తూర్ : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, డీటీ జంగయ్యలు తెలిపారు. కొడిచర్ల, ఖాజీగూడ తండాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మొత్తం 23 దరఖాస్తులు రాగా, పదింటిని పరిష్కరించారు.

కడ్తాల్ : మండల పరిధిలోని వంపుగూడ, వాసుదేవ్‌పూర్‌లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ ముంతాజ్, డీటీ ఆదిత్యల అధ్యక్షతన జరిగిన సదస్సుల్లో వంపుగూడ రైతుల నుంచి 9, వాసుదేవ్ పూర్ రైతుల నుంచి 14 దరఖాస్తులు స్వీకరించారు. ఆర్ఐ రాజిరెడ్డి, సిబ్బంది ప్రవీణ్, హారిక పాల్గొన్నారు.

తలకొండపల్లి : బదునాపూర్‌లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. తహసీల్దార్ నాగార్జున అధ్యక్షతన దరఖాస్తులు స్వీకరించారు. కాంగ్రెస్ నాయకులు యాదగిరి, రాజేందర్ నాయక్, లక్ష్మీకాంత్, శేఖర్, గణేశ్‌గౌడ్, అశోక్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్ : రెవెన్యూ సదస్సుల్లో రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పార్థసారథి తెలిపారు. ఫరూ ఖ్‌నగర్ మండలం ఎలికట్ట, శేరిగూడ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఎలికట్టలో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ మా ట్లాడుతూ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. శేరిగూడలో పరిగిన సదస్సులో డీటీ ఆనంద్ సింగ్ రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

మాడ్గుల : భూసమస్యలు పరిష్కరించుటకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. అన్నెబోయినిపల్లిలో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ వినయసాగర్, కొల్కులపల్లిలో డీటీ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈమేరకు ఆర్డీవో సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎంపీటీసీ భట్టు కిషన్‌రెడ్డి, అన్నెబోయిని పల్లి సర్పంచ్ రాంరెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

కందుకూరు : పెరుగుగూడలోని భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలంటూ బాచుపల్లి మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ తహసీల్దార్ కె.గోపాల్‌కు వినతి పత్రం ఇచ్చారు. పెరుగుగూడ రెవెన్యూ పరిధిలో ఉన్న కుంటను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించారని కుంట భూమిని సర్వే చేయాలని ఆయన తహసీల్ధార్‌కు వివరించారు.

పబ్లిక్ స్కూల్స్‌గా ప్రభుత్వ బడులు

(ఐదో పేజీ తరువాయి)

అభివృద్ధి చేస్తామని తల్లిదండ్రులకు వివరించారు. అధ్యాపకులు, స్కూల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, నాయకులు, తల్లిదండ్రులను సమన్వయ పరిచి కార్యాచరణ రూపొందించారు. ఎస్ఎంసీ రాష్ట్రంలో ఆదర్శ పాఠశాలగా గుర్తింపు పొందిన వరంగల్ జిల్లా మామిడి ప్రభుత్వ పాఠశాలకు తీసుకెళ్లి చూపించారు. అలాగే మన జిల్లాలోని రావిర్యాల హగా కాన్ ప్రైవేట్ పాఠశాలనూ సందర్శించారు. అలాగే ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి అజిత్‌రెడ్డి సైతం ఇటీవల ఆరుట్ల పాఠశాలను సందర్శించారు. పబ్లిక్ స్కూల్ రూపకల్పనపై సమగ్ర నివేదికను పరిశీలించారు. ఇక్కడ కొనసాగుతున్న పనులపై అడిగి తెలుసుకున్నారు.

పాఠశాలకు ఎస్‌డీఎఫ్ రూ.2కోట్ల విరాళం

ఆరుట్ల పాఠశాల అభివృద్ధికి సోషల్ డెమాక్రటిక్ ఫోరం సంస్థ రూ.2కోట్ల విరాళం ఇచ్చింది. ఈ నిధులతో పాఠశాలలో సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇదిగాక రూ.23లక్షల ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్డు వేశారు. ప్రహరీ, యూ జీడీ పనులు కొనసాగుతున్నాయి. జీఎంఆర్ సంస్థ గ్రీనరీ ఏర్పాటు చేయనుంది. ప్రాంగణంలోనే ఆటస్థలం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ఆమనగల్లు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో నేడు(గురువారం) ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ మంజులాదేవి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ప్రకటన విడుదల చేశారు. శిబిరంలో సాధారణ పరీక్షలు, టీబీ, ఎయిడ్స్ మలేరియా, డెంగీ, రక్తహీనత, మధుమేహ పరీక్షలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా టీబీ అధికారుల ఆదేశానుసారం శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వివరించారు. అవసరమైన వారికి ఉచితంగా ఎక్స్‌రే తీయడం జరుగుతుందని మంజులాదేవి తెలిపారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

తలకొండపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గట్టిప్పలపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి గ్రామ నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే పరిశీలించి గట్టిప్పలపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలని కల్వకుర్తి డిపో మేనేజర్‌కు సూచించారు. దీంతో డీఎం రూట్ సర్వే నిర్వహించారు. కల్వకుర్తి నుంచి తలకొండపల్లి వరకు పూర్వ నడిచిన సమయాలకనుగుణంగా బస్సులను కొనసాగిస్తామని డీఎం హామీ ఇచ్చినట్లు గ్రామ నాయకులు తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రేణురెడ్డి, అంజయ్య, శివకుమార్, నరేందర్ గౌడ్,మల్లేశ్, శ్రీనివాస్,రాములు, వరుణ్, రమేశ్, మశ్చందర్, శరత్ చంద్ర, శ్యామ్‌సుందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

'అక్రమ కేసులతో భయపెట్టలేరు'

కందుకూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను ఎవరూ భయపట్టించలేరని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి అన్నారు. ఇటీవల మండల కేంద్రంలో ప్రజాసమస్యలపై పోరాటం చేసి ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు అనేగౌని అశోక్‌గౌడ్‌తో పాటు పలువురిపై పోలీసు అధికారులు పెట్టిన కేసులను ఆధారం చేసుకొని బుధవారం మహేశ్వరం కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాది జి.అశోక్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కేవలం ఫామ్‌హౌజ్‌కే పరిమితమై రాష్ట్ర ప్రజల సమస్యలు పట్టడం లేదంటూ చేపట్టి నిరసన ప్రదర్శనకు దిగిన తమను ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి సూచనతో పోలీసులు అక్రమ కేసులు పెట్టారని గుర్తుచేశారు. ఆ పార్టీ నాయకులు బొక్క సత్యనారాయణరెడ్డి, ఎస్ భూమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా నర్సరీలు ఏర్పాటు చేయొద్దు

- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేశ్

యాచారం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యానవన శాఖ అధికారుల అనుమతి లేకుండా కూరగాయల నర్సరీలు ఏర్పాటు చేయరాదని, కూరగాయల నారుకు సంబంధించి మొక్కలు విక్రయించాలంటే జిల్లా ఉద్యానవనశాఖ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేశ్ తెలిపారు. బుధవారం యాచారంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. తమ శాఖ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోకుండా 3000 వరకు కూరగాయల నారు విక్రయించే నర్సరీలున్నాయన్నారు. నకిలీ కూరగాయల మొక్కలు రైతులకంటగట్టి లాభపడాలనుకునే వారిపై చర్యలు తీసుకుంటా మన్నారు. నకిలీ మొలకలతో నష్టపోయిన రైతులు ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తామని పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో మోడల్ కూరగాయల విక్రయ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర రైతు వ్యవసాయ సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి స్థలం చూపడం అభినందనీయమన్నారు. మండలంలోని మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి, గడ్డమల్లాయాగూడలను కూరగాయల సాగులో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నామన్నారు. రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లను, మల్చింగ్ తదితర వాటిని సమకూరుస్తున్నట్లు తెలిపారు.

సబ్సిడీపై అందుబాటులో జీలుగ విత్తనాలు

ఆమనగల్లు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జీలుగ విత్తనాలు 50 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి పి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. 30కేజీల జీలుగ బ్యాగ్ రూ.4275 కాగా 50 శాతం సబ్సిడీపోను రూ.2137కు రైతులు పొందవచ్చన్నారు. ఆమనగల్లు రైతు సేవా కేంద్రం-1లో 7.5 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు.

అట్టహాసంగా వంశీ జన్మదిన వేడుకలు


కడ్తాలలో కేక్‌కట్ చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, శ్రీనివాస్ రెడ్డి, హన్మ, బీక్య, భాస్కర్‌రెడ్డి


ఆమనగల్లులో మొక్కలు నాటుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ఆమనగల్లు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, టీపీసీసీ డీలిమిటేషన్ కమిటీ ఛైర్మన్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఆమనగల్లు, కడ్తాల మండల కేంద్రాల్లో అట్టహాసంగా నిర్వహించారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బీచ్యనాయక్, జగన్, మానయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమానికి పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మార్కెట్ వైస్ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్‌ఛైర్మన్ కేశవులు, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీ నాయకులతో కలిసి కడ్తాల పాలశీతలీకరణ క్రేంద్రం ఎదుట, ఆమనగల్లు బస్టాండ్ ముందు కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పెద్దఎత్తున బాణ సంచా పేల్చారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. వృద్ధులు, రోగులకు పాలు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు జహంగీర్‌అలీ, చేగూరి వెంకటేశ్, లక్‌పతినాయక్, మల్లేశ్ గౌడ్, గురిగళ్ల లక్ష్మయ్య, బాల్‌రాజ్, హీరాసింగ్, విజయ్, ఖలీల్, కృష్ణనాయక్, ఖాదర్, సత్యం యాదవ్, బోసు రవి, శంకర్ రామకృష్ణ, విఠలయ్యగౌడ్,డాక్టర్ శ్రీనివాస్, మల్లేశ్‌గౌడ్, చందోజీ, కొండల్ రెడ్డి, చెన్నారెడ్డి, ప్రసాద్, షాబోద్దీన్, శ్రీశైలం, శ్రీకాంత్, ఫరీద్, కాలె మల్లయ్య, ఖైసయ్య, సురేశ్, అలీమ్, నాజర్, మహేశ్, కండె సాయి, వెంకటేశ్, శ్రీనునాయక్, రమేశ్, రాజేశ్, యాదయ్య, మల్లేశ్, అశోక్, జహంగీర్‌బా బా, రాజు, హరిలాల్, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్‌లో వీరభద్రంకు డాక్టరేట్

ఆదిభట్ల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మంగల్‌పల్లి సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆచార్యుడిగా పనిచేస్తున్న వడ్లమోని వీరభద్రంకు కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్ లభించింది. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం, పల్లిపాడుకు చెందిన వీరభద్రం హైదరాబాద్‌లోని జేఎన్‌టీయుహెచ్‌లో పీహెచ్‌డీ అడ్మిషన్ పొందాడు. 'యాన్ ఎఫిషియంట్ మెథడ్ ఫర్ గ్రూప్ డేటా షేరింగ్ వయా క్లౌడ్ స్టోరేజీ' అంశంపై పరిశోధన చేసి ప్రొఫెసర్ అరుల్ డాల్టన్ పర్యవేక్షణలో థీసిస్ సమర్పించాడు. సోమవారం జేఎన్‌టీయుహెచ్ వైస్ చాన్స్‌లర్ కిషన్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమన్యం, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు వీడాలి

కడ్తాల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కు నీళ్లు, నిధులు తీసుకువచ్చి రాష్ట్రాభివృద్ధికి బాటలు వేసిన మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా నోటీసులు ఇచ్చిందని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఆరోపించారు. కేసీఆర్‌కు నోటీసులు అప్రజాస్వామికమని, కక్షసాధింపు చర్య అని ఆయన అన్నారు. కాళేశ్వరంప్రాజెక్టుపై విచారణకు హాజరు కావాలని కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘీభావం ప్రకటించారు. బీడు భూములకు సాగునీరందించి రైతుల కలలు సాకారం చేసిన కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణరాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందన్నారు. నీళ్లిచ్చిన కేసీఆర్‌కు రేవంత్ ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం సరి కాదన్నారు. నోటీసులకు, బెదిరింపులకు కేసీఆర్ భయపడే వ్యక్తి కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు వీడి ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలన్నారు.

క్రైం కార్నర్

చోరీ కేసులో ముగ్గురి రిమాండ్

- రూ.15 లక్షలు స్వాధీనం
- ఐదు రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు

కొత్తూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సోదరుడి ఇంట్లో నగదు ఉండడాన్ని తెలుసుకున్న సోదరి మరో ఇద్దరితో కలిసి రూ.15లక్షలు దోచుకున్న సంఘటనను పోలీసులు ఐదు రోజల్లోనే ఛేదించారు. ఈమేరకు నిందితులను అదుపులోకి తీసుకొని నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు కథనం ప్రకారం... కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్‌లో నివాసం ఉంటున్న వన్నాడ శివశంకర్‌గౌడ్ తన తల్లిదండ్రులు భూమి విక్రయించేందుకు అగ్రిమెంట్ చేయగా, కొంత డబ్బు వచ్చింది. ఇందులో కొంత అప్పుగా చెల్లించి మిగతా రూ.15లక్షలను శివశంకర్‌గౌడ్ తన ఇంట్లోని బీరువాలో దాచిపెట్టాడు. తల్లిదండ్రులు తీర్థయాత్రలకు వెళ్లగా.. మే 30న శివశంకర్ గౌడ్ ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్లాడు. గమనించిన శివశంకర్ గౌడ్ సోదరి వన్నాడ స్వప్న అలియాస్ బొడంపల్లి స్వప్న డబ్బును కాజేసేందుకు ప్రణాళిక చేసింది. దాంతో ఆమెకు రియల్‌ఎస్టేట్‌లో పరిచయం ఉన్న షాపూర్‌కు చెందిన అశోక్‌తో ఈ విషయమై చర్చించింది. ఇందుకు రాళ్లగూడకు చెందిన క్రైమ్ హిస్టరీ ఉన్న రఘుతో ప్రణాళిక సిద్ధం చేశారు. ముగ్గురూ కలిసి గతనెల 30న ఆటోలో స్టేషన్ తిమ్మాపూర్‌కు చేరుకొని శివకుమార్ ఇంటి తాళం పగులగొట్టారు. అనంతరం బీరువాలో ఉన్న రూ.15లక్షలు దోచుకుని పోయారు. ముగ్గురు నిందితులు నగదును పంచుకున్నారు. శివకుమార్ ఫిర్యాదు మేరకు స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు కేసు నమోదు చేసి దొంగలను పట్టుకునేందుకు రెండు పోలీస్ టీంలను ఏర్పాటు చేశారు. తన సోదరే దొంగతనానికి పాల్పడి ఉండవచ్చని శివకుమార్ అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం స్వప్నను కుమ్మరిగూడలో ఉన్న తన ఇంటి వద్ద అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించగా దొంగతనాన్ని ఒప్పుకుంది. స్వప్నతో పాటు మరో ఇద్దరు నిందితులు అశోక్, రఘులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.15లక్షలతో పాటు, ఆటో, ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించేందుకు కృషి చేసిన ఎస్ఐలు మురళీగౌడ్, శ్రీనివాసాచారి, కానిస్టేబుళ్లు కుమార్, రవికుమార్, హోంగార్డు నరేష్‌లను శంషాబాద్ డీసీపీ రాజేష్ అభినందించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు

కిలో గంజాయి పట్టివేత!

షాద్‌నగర్ రూరల్, జూన్4(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలో పోలీసులు బుధవారం సాయంత్రం కిలో గంజాయిని పట్టుకున్నారు. ఫరూఖ్‌నగర్ జానమ్మ చెరువు సమీపంలో ఓ వ్యక్తి గంజాయిని అమ్ముతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. సుమారు కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే, పట్టుబడిన వారిలో ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తామని తెలిపారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు


మౌనిక

శంషాబాద్ రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన సంఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ముచ్చింతల్‌కు చెందిన మౌనికకు అదే గ్రామానికి చెందిన ఇస్తరి చేతన్‌తో మే 20న వివాహం జరిగింది. అప్పటి నుంచి వారు ముచ్చింతల్‌లోని వినోద్ గార్డెన్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల ఒకటిన స్నేహితుడి వివాహం నిమిత్తం చేతన్ భార్య మౌనికతో వెళ్లేందుకు సిద్ధం కాగా.. ఇద్దరి మధ్య చిన్న గొడవ జరిగింది. చేతన్ ఉద్యోగరీత్యా ఈ నెల 3న తుక్కుగూడక వెళ్లాడు. అదే రాత్రి ఇంట్లో ఉన్న భార్య మౌనికకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఇంటికి వెళ్లి చూడగా భార్య కనిపించలేదు. ఆచూకీ కోసం తెలిసిన వారి దగ్గర, బంధువుల దగ్గర వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో భర్త చేతన్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొందుర్గులో బాలుడు..


శ్రీకాంత్

చౌదరిగూడ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బాలుడు తప్పిపోయిన ఘటన కొందుర్గు మండలంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై రవీందర్ నాయక్ తెలిపిన వివరాల మేరకు... మండల పరిధిలోని శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన చిటికెల శ్రీకాంత్(14) బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో సైకిల్ తీసుకుని బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఇంటి నుండి వెళ్లేప్పుడు బ్లూకలర్ షర్ట్, లైట్‌గ్రీన్ కలర్ ప్యాంట్ ధరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రామచంద్రపూర్‌నకు చెందిన బాలుడి అమ్మమ్మ అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిస్తే 7702378175, 9390806288, 8712663332(పోలీస్‌స్టేషన్) నంబర్లను సంప్రదించాలని కుటుంబీకులు కోరారు.

కారు-ట్రాలీ ఆటో ఢీ.. ఐదుగురికి గాయాలు

శంకర్‌పల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై కారు, ట్రాలీఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌తో పాటు కారులోని నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈసంఘటన దామరగిద్ద బస్‌స్టేజీకి సమీపంలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. హైదరాబాద్‌లోని చంపాపేట్‌కు చెందిన డ్రైవర్ శ్రీనివాస్ ఎంజీ కారులో తనతో పాటుగా ముగ్గురు వ్యక్తులతో కలిసి నగరం నుంచి వికారాబాద్ వైపు వెళుతుండగా, వికారాబాద్ వైపు నుంచి వస్తున్న ట్రాలీ ఆటో కారును ఢీకొన్నది. కారుతో పాటుగా ట్రాలీఆటో ముందు భాగం దెబ్బతింది. పోలీసులు క్షతగాత్రులను చేవెళ్లలోని విజయ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి



ఎంపీడీవో సుజాతకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కడ్తాల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆంక్షలు లేకుండా అర్హులందరికీ రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈమేరకు దరఖాస్తులు చేసుకున్న అర్హులందరికీ వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని ఎంపీడీవో సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు అర్హులను గుర్తించి పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు దోనాదుల మహేశ్ కోరారు. చాలా మంది పేదలకు పక్కా ఇళ్లు లేక దశాబ్దాలుగా దుర్భర జీవితాలు వెల్లదీస్తున్నారని అన్నారు. బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మాలే శ్రీశైలం గౌడ్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కాంటేకార్ భగీరథ్, బీజేపీ జిల్లా, మండల నాయకులు మన్యనాయక్, నింగ్యారి యాదగిరి, సిద్ధిగారి కుమార్, నేనావత్ ప్రేమ్‌కుమార్, గడ్డం వెంకటేశ్, విక్రాంత్, తుప్పరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.